
సాక్షి
ఒడిశా

గురువారం । 9 । జనవరి । 2025




శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,80,002
బంగారం : 3 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి : 26 గ్రాముల 420 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



క్రీడా సంరంభం

జయపురం తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో స్థానిక సిటీ ఉన్నత పాఠశాలలో వార్షిక క్రీడాపోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. - 8లో



నగరం.. సుందరం

ప్రవాస భారతీయుల ఉత్సవం పురస్కరించుకుని భువనేశ్వర్ నగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. వివిధ కళాఖండాలు ప్రవాస భారతీయుల్ని పలకరిస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

కోట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే సదన నాయిక్ మృతి



సదన్ నాయిక్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



సదన్ నాయిక్ (ఫైల్)

జయపురం: కోట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ రాజకీయ నేత సదన్ నాయిక్ బుధవారం కోట్‌పాడ్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన 1990లో జనతాదళ్ పార్టీ తరఫున కోట్‌పాడ్ నుంచి విధానసభకు ఎన్నికయ్యారు. అనంతరం ఆయన బీజేపీలో చేరారు. నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నాయకుడైన సదన నాయిక్ మృతి చెందిన తెలుసుకున్న బీజేపీ, వివిధ పార్టీల నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

యువతి ఆత్మహత్య



మధుస్మితా మృతదేహం

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి చిత్తపరి-3 పంచాయతీ ఎం.పి.వి. 37 గ్రామంలో మంగళవారం రాత్రి మధుస్మితా పాల్ (18) అనే యువతి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈమె మల్కన్‌గిరిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇటీవలే పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. బుధవారం తిరిగి హాస్టల్‌కు వెళ్లాల్సి ఉంది. ఇంతలో ఏం జరిగిందో గానీ మంగళవారం రాత్రి విషం తాగేసింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుగు దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడిన గురు అంగాళ్

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ రంగంగూడకు చెందిన గురు అంగాళ్ బుధవారం ఉదయం 5 గంటల సమయంలో ఎలుగుబంటి దాడిలో గాయపడ్డాడు. సమీపంలోని అటవీ ప్రాంతంలోకి కట్టెల కోసం వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడి కేకలు విన్న గ్రామస్తులు వెంటనే అక్కడికి వెళ్లి రక్షించారు. అనంతరం కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



నిందితుల సమక్షంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో సేనాపతి

రాయగడ: దొంగతనం కేసులో నలుగురు నిందితులను చందిలి పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 2.50 లక్షల రూపాయల నగదుతో పాటు ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో రమాకంత కులిసిక, ప్రదీప్ మెలక, శివ క్రదక, ఆకాష్ హికకలు ఉన్నారు. ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి ఈ మేరకు చందిలి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీన కొలనార సమితి తెరువలిలోని విదేశీ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ. 2.80 లక్షల నగదు చోరీ జరిగినట్లు మద్యం దుకాణం మేనేజర్ అనీల్‌కుమార్ చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు.

- జాతీయ స్థాయిలో తొలి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒడిశా
- ప్రవాసీ భారతీయ దివస్ సదస్సులో సీఎం మోహన్‌చరణ్ మాఝి

టార్గెట్ 2047



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి ఎస్.జయశంకర్



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్



కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు



విదేశీ వ్యవహారాలు, ఒడిశా మధ్య జరిగిన సంయుక్త వ్యాపార చర్చలో పాల్గొన్న ప్రవాస భారతీయులు

భువనేశ్వర్:

స్వతంత్ర భారత శతాబ్ది జరుపుకొనే 2047 నాటికి జాతీయ స్థాయిలో ఒడిశా తొలి ఐదు అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆకాంక్షించారు. భువనేశ్వర్‌లో యువ ప్రవాస భారతీయ దినోత్సవం బుధవారం ప్రారంభమైంది. కేంద్ర మంత్రులు ఎస్.జయశంకర్, మనసుఖ్ మాండవియా, సీఎం మాఝి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), ఉత్కర్ష్ ఒడిశా, పర్యటన రంగాల్లో వృద్ధికి సంకల్పించిన పలు ప్రణాళికలను ప్రస్తావించారు. భారత దేశం ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, ఒడిశా కూడా ఈ వృద్ధి ప్రయాణంలో భాగం కావాలని ఆకాంక్షించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రముఖ గమ్య కేంద్రంగా ఒడిశా నిలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార శిఖరాగ్ర సమావేశం ఉత్కర్ష్ ఒడిషా కార్యక్రమం రూపొందించినట్లు పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన అధునాతన తయారీ, పెట్రోకెమికల్స్, జౌళి, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ వంటి రంగాలపై కేంద్రీకృతమైన కార్యక్రమాలు ఖరారు చేసినట్లు తెలిపారు. ఒడిశాలో సహజసిద్ధమైన అటవీ వనరులు, అందమైన, పచ్చని పర్వతాలు, 480 కిలో మీటర్ల పొడవైన సముద్ర తీర ప్రాంతం, ఆసియాలో అతి పెద్ద ఉప్పు నీటి సహజ సరస్సు, వందలాది చారిత్రక, మతపరమైన ప్రదేశాలు పర్యాటక రంగంలో పెట్టుబడికి ప్రముఖ ఆకర్షణీయ వనరులుగా ఆకట్టుకుంటాయని వివరించారు. విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ మాట్లాడుతూ సాంస్కృతిక, పర్యాటక, కళాత్మక రంగాల్లో ఒడిశా అభివృద్ధి కేంద్రంగా ఉందన్నారు. యువ ప్రవాస భారతీయులు విదేశాల నుంచి తోటి యువ స్నేహితులను తీసుకొస్తే కచ్చితంగా వారికి జీవితకాల జ్ఞాపకం అవుతుందని ప్రసంగించారు. రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారు తమ సొంత వృద్ధితో పాటు రాష్ట్ర సమ్మిళిత వృద్ధికి శక్తివంతంగా సహకరించిన వారవుతారని పేర్కొన్నారు.



ప్రవాస యువ భారతీయ దినోత్సవ వేదికపై కేంద్రమంత్రి జయశంకర్, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తదితరులు

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు శిక్షణ



జిల్లా స్థాయి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ పోటీలకు హాజరైన విద్యార్థులు



శిక్షణలో పాల్గొన్న గైడ్స్



శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్‌కు బోధిస్తున్న శిక్షకులు



పతాక వందనం చేస్తున్న ట్రైనీ కమిషనర్లు

జయపురం: కొరాపుట్ జిల్లా స్థాయి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన టెస్టును స్థానిక మోడరన్ ఇంగ్లిష్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి పర్యవేక్షణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 65 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారు. జిల్లా స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ నిరంజన్ పాణిగ్రహి, జిల్లా స్కౌట్స్ శిక్షణ కమిషనర్ సంతోష్ కుమార్ ప్రధాన్, గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ నిధి త్రిపాఠి, గైడ్స్ జిల్లా శిక్షణ కమిషనర్ ప్రభాశిని లిమాల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 32 మంది స్కౌట్స్, 33 మంది గైడ్స్ సోపాన టెస్టులో పాల్గొని వివిధ కార్యక్రమాల్లో శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో నళిణీ మహాపాత్రో, రశ్మీ నాయక్, సుమిత్ర కుమార్ పట్నాయక్, గోపాల చంద్ర మహరాణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల కార్యదర్శి భీమ బెహర, రాధామాధవ పండా, సుప్రియ పాణిగ్రహి తదతరులు సహకరించారు.

ఆలోచింపజేసిన 'జీవనం-ఒక నాటకం'



నాటకంలో కళాకారులు, టెక్నీషియన్లు



నాటకంలో ఓ సన్నివేశం

జయపురం: బరంపురం గిరి మార్కెట్‌లోని ప్రకాశం హాల్‌లో జరుగుతున్న ఎనిమిదవ రాష్ట్రస్థాయి 34వ దక్షిణ నాటక మహోత్సవాలు 2025 ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి జయపురం నిర్జరాణి నాటక కళాకారులు ప్రదర్శించిన 'జీవనం-ఒక నాటకం' నాటిక ప్రేక్షకులను ఆలోజింపజేసింది. మనిషి పుట్టిన నుంచి చనిపోయే వరకు జీవితం ఒక నాటకమయం, సుఖ దుఃఖాలలో, జీవన శైలిలో పలు పాత్రలలో మనిషి నటిస్తాడనే సందేశాన్ని కళాకారులు తన ప్రదర్శన ద్వారా తెలియజేశారు. రచయిత జగదీష్ అధికారి మనిషి జీవిత గమనాన్ని చక్కగా తెలియజేశారు. నిరంజన్ పాణిగ్రహి దర్శకత్వంలో అభినాష్‌గా పంచానన మిశ్ర, బపిగా అశోక్ మహరాణ, మాలతిగా విజయ పాణిగ్రహి, రాజుగా విష్ణురాజ్ ఆచారి, రవిగా నిరంజన్ పాణిగ్రహి, జితుగా పవిత్ర మల్లిక్‌లు తమతమ పాత్రలలో జీవించి ప్రేక్షకులను మెప్పించారు. కళాకారులు యుగల సాహు, సమర్పిత పాణిగ్రహిలు తమ నటనలతో ప్రేక్షకుల మన్ననలను పొందారు. మానవ జీవితానికి అద్దం పట్టే జీవనం-ఒక నాటకం' నాటకానికి రామనిగం మహంతి సంగీతం సమకూర్చారు.

యువకుడి దారుణ హత్య

భువనేశ్వర్: స్థానిక రసూల్‌గడ్ ఓవర్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యేక స్క్వాడ్ పోలీసుల బృందం వీరిని అరెస్టు చేసింది. వీరిలో ఒక మహిళ ఉంది. ఈమె నయాగడ్ జిల్లా సారొంబొకు ప్రాంతానికి చెందినది. హత్యకు గల కారణాలు తెలియలేదు. బ్రౌన్ షుగర్ వ్యాపార సంబంధిత పాత కక్షలు కారణంగా భావిస్తున్నారు. మృతుడు స్థానిక కేదార్‌పల్లి మురికివాడకు చెందిన సహదేవ్ నాయక్‌గా గుర్తించారు. ఇతను స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఉద్యోగి. బీఎంసీ సఫాయి కర్మచారి సంఘం అధ్యక్షుడు, పోలీసు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన కుమార్తెను స్థానిక వీఎస్ఎస్ నగర్ ప్రాంతంలోని పాఠశాలలో వదిలి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తుండగా రసూల్‌గడ్ స్క్వేర్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై దుండగులు కత్తులతో దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని క్యాపిటల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేదార్‌పల్లి మురికివాడలో బ్రౌన్‌షుగర్ విక్రయాలు జరుపుతున్న కొందరు అక్రమ వ్యాపారానికి అడ్డు తొలగించేందుకు తన భర్తను హత్య చేశారని మృతుడి భార్య ఆరోపించింది.

దివ్యాంగుల పరిరక్షణకు చట్టాలు అమలు

కొరాపుట్: దివ్యాంగుల పరిరక్షణకు అనేక చట్టాలను ప్రభుత్వం అమలు చేస్తోందని కొరాపుట్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ వేణుధర్ అన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ కళాశాల ఆవరణలో దివ్యాంగుల చట్టం-2016పై జరిగిన బుధవారం అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. చట్టాల అమలు కోసం అన్ని శాఖల అధికారులు బాధ్యత వహించాలన్నారు. అవగాహన పొందిన దివ్యాంగులు కూడా ఈ వివరాలు సాటి దివ్యాంగులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఖటువా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి పుష్పాంజలి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 14 సమితులు, నాలుగు పురపాలక సంఘాల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు.

పర్లాకిమిడిలో ప్రవాస భారతీయ దివస్



ఎన్ఆర్ఐ రోషన్ నాయిక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: తల్లిదండ్రుల సహకారం లేనిదే విదేశాలలో ఉన్నత చదువులు, స్థిరపడలేమని అమెరికా ప్రవాస భారతీయుడు, వర్జీనియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ రోషన్ నాయక్ అన్నారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని కామన్ వెల్త్‌బ్యాంక్ ప్రొడక్ట్ మేనేజరుగా పనిచేస్తున్న సంతోష్ పాణిగ్రాహి, వర్జినియా వర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసరు రోషన్ నాయక్‌లను కలెక్టర్ దాస్ దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ప్రవాస భారతీయులు ఒడియా భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు. వీసా, ఇతర సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, డీఈఓ మాయాధర్ నాయక్, హెచ్ఎంమోనాలిసా దాస్, గుసాని బ్లాక్ విద్యాధికారి టి.కిషోర్, ఉపాధ్యాయులు జగన్నాధ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ బదిలీ ఆపకపోతే పాఠశాలను తెరవనివ్వం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

జయపురం: కొట్‌పాడ్ సమితి బొనసులి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహననాయిక్ బదిలీని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బదిలీ రద్దు చేయలేని పక్షంలో పాఠశాలకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్‌ను జయపురంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మోహన నాయిక్ కృషి వల్ల తమ పిల్లలు చక్కగా చదువుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో బదిలీ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణ చంద్ర పూజారి, గ్రామపెద్దలు సోమనాథ్ పూజారి, బిశ్వనాథ్ తండి, లింగరాజ్ బిశాయి, కృష్ణ రామశిశా, దీనబంధు హరిజన్, రవీంద్ర బిశాయి, అనిల్ ధనపూల్, దొంబురు తదితరులు పాల్గొన్నారు.

నేడు గజపతి జిల్లాకు మంత్రి ఖడ్సే రాక

పర్లాకిమిడి: రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి రక్షా నిఖల్ ఖడ్సే గజపతి జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. భువనేశ్వర్‌లో బయలుదేరి హెలికాప్టర్‌లో గజపతి స్టేడియంలో దిగి సర్క్యూట్ హౌస్ నుంచి నేరుగా గుమ్మా బ్లాక్‌లో మునిసింగి రబ్బరు ప్లాంటును సందర్శించనున్నారు. అక్కడ జి.పి.ఎల్.ఎఫ్, మహిళా స్వయం సహాయక గ్రూపులతో మాట్లాడతారు.

అనంతరం తరంగడ పంచాయతీకి చేరుకుని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకంపై అంగన్‌వాడీ, పి.ఎస్.సి. అధికారులతో సమావేశమవుతారు. తరువాత పర్లాకిమిడి కలెక్టరేట్‌లో పాలనాధికారి, స్పోర్ట్స్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

విద్యార్థినితో అనుచిత ప్రవర్తన

- ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ అరెస్టు



నిరంజన్ జెనా

భువనేశ్వర్: సహాయం చేస్తానని మభ్యపెట్టి విద్యార్థినితో అనుచితంగా ప్రవర్తించిన ఆరోపణ కింద రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)ని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పి) బుధవారం భువనేశ్వర్‌లో అరెస్టు చేశారు. నిందితుడు ఏఎస్ఐ నిరంజన్ జెనాగా గుర్తించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ థానాలో బాధిత బాలిక చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏఎస్ఐని అరెస్టు చేశారు. జగత్‌సింగ్‌పూర్ నుంచి వచ్చిన విద్యార్థిని సోమవారం భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగింది. ఆమె హాస్టల్ మూసివేయడంతో సాయం కోసం రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై రైల్వే పోలీసులను ఆశ్రయించింది. ఈమె నిస్సహాయ స్థితిని సొమ్ము చేసుకునే ప్రయత్నంలో అనుచిత ప్రవర్తనకు తలపడ్డాడు. ఒంటరిగా ఉన్న బాలిక తలదాచుకునేందుకు ఆశ్రయం కల్పిస్తానని తన గదికి తీసకెళ్లి అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డాడు. అతని వద్ద నుంచి బయటపడిన బాధిత బాలిక రైల్వే స్టేషనులో ప్రభుత్వ రైల్వే పోలీసుల్ని సంప్రదించడంతో నిందిత ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐని జీఆర్‌పీ అరెస్టు చేశారు.

క్లుప్తంగా

11న మహాధర్నా

మెళియాపుట్టి: ఈనెల 11వ తేదీన మండల కేంద్రంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వంకల మాధవరావు తెలియజేశారు. దీనిలో భాగంగా మండలంలోని ముకుందాపురం గ్రామంలో గిరిజన యువతతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. గిరిజన గ్రామాలకు వెళ్లి ఐటీడీఏ సాధన, ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడం, తదుపరి పోరాటాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఐటీడీఏ లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవాలంటే మన్యం జిల్లా సీతంపేట వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో ఆంపురం, ముకుందాపురం సర్పంచ్‌లు జమ్మయ్య, భాస్కరరావు, గిరిజన నాయకులు గొరేసు, ఢిల్లీరావు, నూకయ్య, సురేష్, ఆదినారాయణ, అప్పారావు, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో కాంట్రాక్ట్ లెక్చరర్ మృతి

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో హిస్టరీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గుంపాన బాబూరావు (58) విధి నిర్వహణలో మృతిచెందారు.. బుధవారం ఉదయం 9.30 గంటలకు డిగ్రీ కళాశాలకు చేరుకున్న ఆయన 11.45 గంటల సమయంలో ఛాతినొప్పి వస్తుందని చెప్పడంతో తోటి అధ్యాపకులు వెంటనే పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బాబూరావు ఐదేళ్లుగా పాతపట్నం దేవాంగులవీధి నివాసముంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటారు. ఈయన స్వగ్రామం అనకాపల్లి జిల్లా సీడికాడ మండలం సరిజం గ్రామం. భార్య గుంపాన రవణమ్మ, ఇద్దరు కుమారులు సింహాద్రి మృత్యుంజయ, మహాదేవులనాయుడు ఉన్నారు. బాబూరావు మృతి పట్ల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, అధ్యాపకులు సంతాపం తెలిపారు.

మకరాంపురం యువకుడి ప్రతిభ



తమరాల అవినాష్

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన పేదింటి యువకుడు తమరాల అవినాష్ ఒకేసారి రెండు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పీఓగా, తెలంగాణా గ్రామీణ బ్యాంకు క్లర్క్ పోస్టులకు ఎంపికయ్యాడు. తండ్రి లక్ష్మణమూర్తి వ్యవసాయం చేస్తూ అనారోగ్యానికి గురై మూడేళ్ల క్రితం మృతిచెందారు. తల్లి జయమ్మ కుమారులు అవినాష్, అభిషేక్‌లను చదివించింది. సోదరుడు అభిషేక్ ఇప్పటికే బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా అవినాష్ కూడా ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

క్రీడాసంరంభం



పరుగు పందెంలో విద్యార్థులు



- ఉత్సాహంగా క్రీడాపోటీలు ప్రారంభం

జయపురం: జయపురం తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో స్థానిక సిటీ ఉన్నత పాఠశాలలో వార్షిక క్రీడాపోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఛాడేశ్వరి మందిరంలో పూజలు చేసి జెండా ఊపి సిటీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయక్ క్రీడోత్సవాలను ప్రారంభించారు. అక్కడ నుంచి క్రీడా జ్యోతిని తోడ్కొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో నెహ్రూనగర్‌లోని పాఠశాల మైదానానికి చేరారు. 100 మీటర్ల పరుగు, రిలే రేస్, స్లో సైక్లింగ్, డిస్కస్ త్రో, స్కిప్పింగ్, షార్ట్‌పుట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సిటీ స్కూల్ తెలుగు విభాగ ప్రధాన ఉపాధ్యాయురాలు బి.సుజాత, పీఈటీ రీటా సామంతరాయ్, ఉపాధ్యాయులు సుస్మిత పాత్రో, కె.పద్మాదేవి, ప్రతాప్ కుమార్ పట్నాయక్, కృష్ణ కుమారి మిశ్ర, జి.సాయి, తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షులు బిరేష్ పట్నాయక్, పి.శ్రీనివాస రాజు, దుర్గా ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు



హాజరైన క్రీడాకారులు



స్కిప్పింగ్ పోటీల్లో విద్యార్థులు

గణతంత్ర వేడుకలకు సన్నాహం



హాజరైన పోలీసులు, ఇతర అధికారులు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారి

పర్లాకిమిడి: జిల్లా స్థాయిలో గజపతి స్టేడి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సమావేశం జరిగింది. గజపతి కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఎ. ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధినాయక్, డి.పి.ఆర్.ఓ పాల్గొన్నారు. జనవరి 26న జిల్లా పౌర సమాచార శాఖ ద్వారా ఉదయం 4.30 గంటలకు రామ్‌ధూన్, 6 గంటలకు పట్టణంలో వరపుత్రుల విగ్రహాలకు పూలమాలలు, ఏడు గంటలకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో జాతీయ పతాకం ఎగురవేయడానికి నిర్ణయించారు. ఉదయం 8.30 గంటలకు జాతీయ పతాకాన్ని స్టేడియంలో ముఖ్యఅతిథి ఎగురవేస్తారు. రిపబ్లిక్ దినోత్సవం కోసం ఈ నెల 21 నుంచి 23 వరకు స్టేడియంలో పెరేడ్ నిర్వాహణ, వివిధ పాఠశాలల మధ్య వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశానికి ఒడిశా మూడో బెటాలియన్ కమాండెంట్, రిజర్వ్‌డ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా సాంస్కృతికశాఖ అధికారి అర్చనా మంగరాజ్, వివిధ బ్యాంకుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం జరిగింది. బుధవారం రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ శిబిరాన్ని ప్రారంభించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం-2025 సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. 40 మంది రక్తదానం చేశారు.

నర్మదా దాస్‌కు సన్మానం



నర్మదా దాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ శిక్షాధికారి నర్మదా దాస్‌ను బుధవారం కాశీనగర్ వారణాసి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులంతా సన్మానించారు. కాశీనగర్ బ్లాక్‌లో నర్మదా దాస్ స్కూళ్ల పర్యవేక్షణ, ఉపాధ్యాయులతో అనోన్యత, కార్యదీక్షత, వ్యవహారశైలిని మెచ్చుకుని బ్లాక్‌లో ఉపాధ్యాయులంతా కలిసి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సన్మాన సభలో ఉపాధ్యాయులు జగదీష్ పాత్రో, ఎం.శ్రీనివాస్, గోపాలరావు, లోకనాథ్, ఆర్.మధు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ చాంపియన్‌గా కొరాపుట్



బహుమతుల ప్రదానంలో ఎమ్మెల్యే, అతిథులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పంచాయతీ కుసుమి మూన్‌లైట్ స్టేడియంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కుమారుడు స్వర్గీయ శివ ప్రసాద్ బాహిణీపతి పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించారు. శివరాం ప్రసాద్ బాహిణీపతి మెమోరియల్ టి-20 క్రికెట్ టోర్నమెంట్‌లో కొరాపుట్ టీమ్ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌కు చేరిన రాయగడ, కొరాపుట్‌లు బుధవారం తలపడ్డాయి, టాస్ గెలిచిన రాయగడ టీమ్ 20 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 161 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగి 16 ఓవర్లలో 165 పరుగులు చేసి విజయం సాధించింది. టోర్నమెంట్ బహుమతుల ప్రదానంలో ఖడియాల్ ఎమ్మెల్యే అధిరాజ్ రంజన్ పాణిగ్రాహి, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు.



ట్రోఫీతో కొరాపుట్ టీమ్

కుములి లక్ష్మణ బాలాజీ క్రికెట్ క్లబ్ వారు నిర్వహించిన టోర్నమెంట్‌లో బహుమతుల ప్రదానోత్సవానికి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు సుశాంత కుమార్ బెహర అధ్యక్షత వహించారు. జిల్లా పరిషత్ సభ్యులు పింకు శతపతి, సమాజ సేవకుడు సురేంద్ర త్రిపాఠీ, కుములి సర్పంచ్ పార్వతీ జాని, క్లబ్ కార్యదర్శి అనిల్ దేబత, సీనియర్ క్రీడా ఉపాధ్యాయులు బినోద్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

నగరం.. సుందరం



ఉత్కళ విశ్వ విద్యాలయం ప్రవేశ మార్గం ప్రాంగణంలో కళాఖండం

- ప్రవాస భారతీయ దివస్ సందర్భంగా ఆకట్టుకున్న ఆకృతులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన బీఎంసీ

భువనేశ్వర్: 18వ ప్రవాస భారతీయుల ఉత్సవం పురస్కరించుకుని భువనేశ్వర్ నగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. మారు మూల ప్రాంతాలు, ప్రధాన కూడళ్ల సృజనాత్మక కళాఖండాల ఆవిష్కరణతో ప్రవాస భారతీయుల్ని పలకరిస్తున్నాయి. రహదారులు, ఫ్లైఓవరు వంతెనలు వంటి సాధారణ ప్రాంగణాలు సరికొత్త అలంకరణతో తళుక్కుమంటున్నాయి. విమానాశ్రయం నుంచి సాధారణ వీధుల్లో రహదారులు ఎక్కడిక్కడ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి శీర్షికలతో చిత్రీకరించుకుని శోభిల్లుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఈ ఏర్పాట్లు చేశాయి.

అలరించిన కార్యక్రమాలు

రాత్రింబవళ్లు ప్రవాస భారతీయుల్ని ఉల్లాసపరిచేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. అంతర్జాతీయ ఒడిస్సీ నృత్యోత్సవం, రాజారాణి సంగీత ఉత్సవం, ముక్తేశ్వర్ ఒడిస్సీ నృత్యోత్సవం, సంగీతోత్సవాలు, రాత్రింబవళ్లు పని చేసే బొయెునికా చేనేత విక్రయ కేంద్రాలు, మ్యూజియం, కళా శిబిరాలు, ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలతో నగరం పగలు రాత్రి ఒకేలా సందడిగా తయారైంది. కనులు మిరమిట్లు గొలిపే విద్యుద్దీప అలంకరణతో తళుక్కుమంటున్నాయి. స్థానిక మ్యూజియంలో రాష్ట్ర రాజరిక ఆస్తులు, వస్త్రాలు, గిరిజనుల జీవన శైలి, తోలుబొమ్మలు, తొడుగులు ప్రదర్శించే ఆరు కొత్త గ్యాలరీలు, ఓరియంటేషన్ హాలు, తాళపత్రాలపై రామాయణం వంటి అపరూప ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నెల 12 వరకు ప్రవాస భారతీయుల సందర్శన సౌకర్యం కోసం నిత్యం రాత్రి 9 గంటల వరకు మ్యూజియం తెరిచి ఉంటుంది. మరో వైపు ఏకామ్ర వనంలో గుబాళించే పుష్ప ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏకామ్ర ఉత్సవం, ఆదివాసీ జాతర, గిరిజన నృత్యోత్సవం, జానపద కళా ఉత్సవాలు ఉర్రూతలూగిస్తున్నాయి. 20 గిరిజన వర్గాలు ఈ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటున్నాయి.



అంతర్జాతీయ నృత్యోత్సవంలో ఒడిస్సీ నృత్య భంగిమ



రాజమహల్ ఛక్ ప్రాంతంలో పునర్వినియోగ సంచుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ సందేశాత్మక శిల్పం




విద్యుద్దీప అలంకరణలో ప్రధాన రహదారి



ప్రవాస భారతీయ దివస్ వేదిక ప్రాంగణం ప్రధాన ప్రవేశ ద్వారం



రాజమహల్ కూడలి ఓవరు బ్రిడ్జి దిగువ భాగంలో కళాకృతి



జయదేవ్ విహార్ ప్రాంతంలో వంతెన సొబగులు



కాంతులీనుతున్న రాష్ట్ర ప్రభుత్వ పాలన విభాగాల సముదాయం ఖారవేళ భవన్

జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించాలి



కలెక్టర్‌ను కలిసిన క్రికెట్ క్రీడాకారులు

జయపురం: అవిభక్త కొరాపుట్‌కు కేంద్ర బిందువైన జయపురంలో జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించాలని జయపురం క్రికెట్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. క్రికెట్ అసోసియేషన్ కోఆర్డినేటర్ సుభాష్ రౌత్ నేతృత్వంలో క్రికెట్ క్రీడాకారులు బుధవారం కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కొరాపుట్ జిల్లా క్రీడా రాజధానిగా జయపురం ఉంటుందన్నారు. జయపురంలో అత్యధిక క్రికెట్ ఆటగాళ్లు ఉన్నారని గుర్తుచేశారు. క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తే క్రికెట్ అకాడమీ ఏర్పడుతుందన్న అభిప్రాయం వెల్లడించారు. జయపురం తహసీల్‌లో జయపురం 1వ మౌజా జగన్నాథ్ సాగర్ సమీపంలో ఖాతా నంబర్ 256, ప్లాట్ నంబర్ 77లో 12 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలంలో క్రికెట్ స్టేడియం నిర్మించాలన్నారు. గత ప్రభుత్వ సమయంలో రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. ఈ ప్రభుత్వం కూడా క్రీడా ప్రగతికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా క్రీడా అసోసియేషన్ ఎన్నికలు అనేక ఏళ్లుగా నిర్వహించలేదని, కేవలం ఇద్దరు వ్యక్తులే అసోసియేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే క్రీడా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రవేశ పరీక్షకు విశేష స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

మల్కన్‌గిరి: జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరంలో ఒడిశా ఆదర్శ విద్యాలయంలో ప్రవేశానికి బుధవారం పోడియా సమితి కార్యాలయంలో పరీక్ష నిర్వహించారు. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 240 మంది విద్యార్థులకు 210 మంది హాజరయ్యారని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, పరీక్ష కేంద్రం హెచ్‌ఎం ఖురదా కాబాసీ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోడియా సమితి విద్యాశాఖ అధికారి రమేష్ చంద్ర బరోయి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారా స్థావరాలపై దాడులు



దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా నిల్వ చేసే టబ్బులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు సందుబడి గ్రామ పరిసరాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 4,300 లీటర్లు పులియబెట్టిన బెల్లపు ఊటను, రేగుల పాడులో 1200 లీటర్ల పులియబెట్టిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే భారీగా సామగ్రితో పాటు 260 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

భోగాపురం: మండలంలోని చినకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల అమ్మోరు(31) అనేవ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రాత్రి బహిర్భూమికని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అమ్మోరు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి గనగళ్ల అంకమ్మ తన బంధువులతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికింది. అయినప్పటికీ కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీనివాస్ చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



రైల్వే పట్టాలపై పడిఉన్న వృద్ధుడి మృతదేహం

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామానికి చెందిన బంకురు సూర్య నారాయణ(73) అనే వృద్ధుడు రైలుఢీకొన్న ప్రమాదంలో బుధవారం మృతిచెందాడు. డొంకినవలస రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆయన గ్రామంలోని ఎఫ్‌సీఐ గిడ్డంగిలో కలాసీగా పనిచేసేవాడని గ్రామస్తులు చెప్పారు. ఆయనకు భార్య అప్పలనర్సమ్మ, పెళ్లయిన కుమార్తె, ఆర్మీలో పనిచేస్తున్న కుమారుడు గోపీ ఉన్నారని తెలిసింది. బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలో భద్రపరిచారు.

ఐటీఐలో జాబ్‌మేళా రేపు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్విగ్గీ వేర్‌హౌస్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, పటేల్ రైలు తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ కోర్సులు, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వయోపరిమితి 18–35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులు ధృవీకరణపత్రాలు, జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకుని నేరుగా హాజరు కావచ్చని సూచించారు. ముందుగా ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8790118349, 9988853335నంబర్లను సంప్రదించాలని కోరారు.

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు శిక్ష

డెంకాడ: మహిళ మెడలోని బంగారు వస్తువులు తెంచుకుని పోయిన విశాఖపట్నానికి చెందిన ముద్దాయి భీమరశెట్టి కమలనాథ్‌కు విజయనగరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రత్నకుమారి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు ఈ కేసుపై ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023వ సంవత్సరం నవంబర్ 6వ తేదీన రఘుమండ గ్రామానికి చెందిన గూడెల సీతారాత్నం అనే మహిళ భోగాపురం మండలంలోని నందిగాం వెళ్లి తిరిగి స్వగ్రామమైన రఘుమండ వస్తోంది. రఘుమండ జంక్షన్‌లో ఆటో దిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు తాడు, నల్లపూజలు తెంచి పారిపోయాడు. దీంతో ఆమె డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సన్యాసినాయుడు కేసు నమోదు చేసి నిందితుడైన భీమరశెట్టి కమలనాథ్‌ను గత ఏడాది నవంబర్ 22న అరెస్ట్ చేశారు. కేసు విచారణలో కమలనాథ్ నేరాన్ని అంగీకరించడంతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రత్నకుమారి పై విధంగా తీర్పునిచ్చారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.3.51లక్షలు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల నుంచి 72 రోజులకు రూ.3,51,594లు ఆదాయం, కోదండరామాలయంలోని హుండీల నుంచి రూ.12,490లు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ బుధవారం తెలిపారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సమస్యల కొలువు

- వైద్యులు, సిబ్బంది కొరతతో కార్మికులకు అందని సేవలు
- సెలవులో ఇద్దరు వైద్యులు
- ఎక్స్‌రే టెక్నీషియన్ లేక నిలిచిన సేవలు
- ఈఎస్‌ఐ పరిధిలో 19 వేలమంది కార్మిక కుటుంబాలు



ఈఎస్‌ఐ డయాగ్నోస్టిక్ సెంటర్



చికిత్స కోసం వచ్చిన కార్మికులు

విజయనగరం ఫోర్ట్: ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సమస్యలు కొలువుదీరాయి. వైద్య సిబ్బందితో కొరతతో పాటు పరికరాలు పనిచేయకపోవడంతో కార్మికులకు సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. వైద్య పరికరాలు నెలలు తరబడి పనిచేయకపోయినా, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసే మిషన్ పాడవడంతో రోగులకు వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఎక్స్‌రే టెక్నీషియన్ లేక ఎక్స్‌రేలు కూడా తీయడం లేదు. వైద్యులు సెలవు పెట్టడంతో సంబంధిత సేవలు అందడం లేదు. దీనికి తోడు ఆస్పత్రికి వచ్చే కార్మికుల పట్ల కొంతమంది వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబొరేటరీకి..

ఈఎస్‌ఐ డయాగ్నోస్టిక్ సెంటర్ పరిధిలో 19 వేల కార్మిక కుటుంబాలు ఉన్నాయి. డయాగ్నోస్టిక్ సెంటర్లో అత్యంత ప్రధానమైన సీబీపీ మిషన్ పాడవడంతో సీబీపీ(కంప్లీట్‌బ్లడ్ పిక్చర్) పరీక్ష జరగడం లేదు. సీబీపీలో హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), ప్లేట్‌లెట్స్ కౌంట్, తెల్ల రక్తకణాల కౌంట్ (డబ్ల్యూబీసీ), ఆర్‌బీసీ వంటి 11 రకాల పరీక్షలు జరుగుతాయి. ఇది ఆస్పత్రికి వచ్చే అధిక శాతం మందికి కార్మికులకు అవసరం ఉంటుంది. సీబీపీ పరీక్ష జరగకపోవడం వల్ల కార్మికులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఓపీ విభాగాలు

ఈఎస్‌ఐ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎముకల విభాగం, అప్తామాలజీ, గైనిక్, ఈఎన్‌టీ, పిడియాట్రిక్ ఓపీ విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా పెథలాజీ, ఎనస్తీయా వైద్యులు కూడా ఉన్నారు. అయితే ఎముకల వైద్యులు నెల రోజుల నుంచి సెలవులో ఉన్నారు. అదేవిధంగా జనరల్ సర్జరీ వైద్యులు నెలన్నర రోజులుగా సెలవులో ఉన్నారు. దీంతో ఆయా విభాగాలకు వచ్చిన కార్మికులకు ఆ స్పెషాలిటీ సేవలు అందడం లేదు. ఎంబీబీఎస్ వైద్యులు సేవలు అందిస్తున్నారు. దీనికి తోడు ఆస్పత్రికి వచ్చే కార్మికుల పట్ల కొంతమంది వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మికులు ఏదైనా అడిగితే నీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ వైద్యులు మాట్లాడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

తగ్గుతున్న ఓపీ సంఖ్య

ఒకప్పుడు ఈఎస్‌ఐ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు అధిక సంఖ్యలో కార్మికులు వచ్చేవారు. కానీ ఇప్పుడు వారి సంఖ్య తగ్గిందని తెలుస్తోంది. వైద్యుల పట్ల కార్మికులకు నమ్మకం సన్నగిల్లడంతో ఆస్పత్రికి వచ్చే కార్మికుల సంఖ్య తగ్గుతోంది. గతంలో ఓపీకి రోజుకు 60 నుంచి 70 మంది వరకు వచ్చేవారు. కాని ఇప్పుడు 40 నుంచి 50 కి అసంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

మందులు వస్తాయి

థర్డ్ క్వార్టర్ మందులు ఒకటి, రెండు రోజుల్లో వచ్చేస్తాయి. జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ వైద్యులు సెలవు పెట్టిన మాట వాస్తవమే. రోగుల పట్ల వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టు నియామకం ప్రాసెస్‌లో ఉంది. సీబీపీ మిషన్ పనిచేయని విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– డాక్టర్ కృష్ణ కిషోర్, సూపరింటెండెంట్, ఈఎస్‌ఐ డయాగ్నోస్టిక్ సెంటర్

మందుల కొరత

ఆస్పత్రిలో మందులు పూర్తిస్థాయిలో లేక పోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారు. ధనుర్వాతం రాకుండా చేసే టీటీ ఇంజక్షన్ కూడా లేదు. అదేవిధంగా దగ్గు సిరప్‌లు ఆస్పత్రిలో లేవని కార్మికులు చెబుతున్నారు. ఆస్పత్రికి రావాల్సిన థర్డ్ క్వార్టర్ మందులు ఇంతవరకు రాలేదు. దీంతో మందులు కూడా కార్మికులు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి వద్ద రెండు రోజు క్రితం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. సిబ్బంది, మందులు, ఎక్స్‌రే పరికరాలు లేక పోవడం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం వేగవంతం చేయాలని, అన్ని రకాల సేవలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మి, సుధారాణి, రవికుమార్, జగన్‌మోహన్ రమణ, పైడిరాజు, నాయుడు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులు జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించాలి

- కృష్ణప్రసాదరావు, జీసీఎంస్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్



అటవీ ఉత్పత్తుల ధరలను ప్రకటిస్తున్న జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, ఇతర అధికారులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు కేంద్రాలు, డీఆర్ డిపోల వద్దే విక్రయించాలని గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయం వద్ద అకౌంటెంట్ గణపతి గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావుతో కలిసి 2024–2025 సంవత్సరానికి గాను గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సూచించిన అటవీ ఉత్పత్తుల కొనుగోలు ధరలను కిలోల చొప్పున ప్రకటించారు. పిక్కతో చింతపండు రూ.34, పిక్క తీసిన చింతపండు కిలో రూ.67, కరక్కాయలు రూ.20, నరమామిడి చెక్క రూ.18, నల్లజీడి పిక్కలు రూ.22, ఇండుగ పిక్కలు రూ.50, ఎండు ఉసిరిక పప్పు రూ.90, కాగుపప్పు రూ.25, విప్ప పప్పు రూ.32, కొండతామర జిగురు రూ.114, ముషిడిక పిక్కలు రూ.100, తానికాయలు రూ.18, కుంకుడు కాయలు రూ.35, శీకాకాయలు రూ.40, అడవి తేనె రూ.250, పుట్ట తేనె రూ.160లు, తేనెమైనం రూ.160, కొండ చీపుర్లు(గ్రేడ్–1) రూ.45లు చొప్పున ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఉత్పత్తులు సేకరించే సమయంలో గిరిజనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, దళారులకు అమ్మి మోసకపోకుండా జీసీసీలోనే విక్రయించి గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా గిరిజనులకు విజ్ఞప్తి చేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ జీవన్ రాణి



డెంకాడ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవన్‌రాణి

డెంకాడ: అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి జీవన్‌రాణి అన్నారు. డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వైద్యారోగ్య శాఖద్వారా అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ డాక్టర్ శివ రామకృష్ణ, సిబ్బందితో చర్చించారు. డెంకాడ గ్రామంలో పిల్లలకు వ్యాక్సిన్‌లు వేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడూతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, జాగ్రత్తలు వివరించడం ద్వారా చాలావరకూ వాటిని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రాజు, అనిల్‌కుమార్, సూరి అప్పారావు, యాసయ్య, అప్పలనాయుడు, మీనాకుమారి, గోవింద, దుర్గారావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విధులు ముగించి ఇంటికి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి
- మరో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



మృతుడు ఎన్‌వీ రమణ



తీవ్రంగా గాయపడిన రఘునాథ రెడ్డి

గంట్యాడ: విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో నివాసం ఉంటున్న హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ రమణ రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతిచెందారు. గంట్యాడ మండలంలోని కొండ తామరపల్లి జంక్షన్‌లో జరిగిన ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ రమణ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో ఏపీఎస్పీ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఆయన విధులు ముగించుకుని విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు స్కూటీపై వస్తుండగా కొండతామరపల్లి జంక్షన్‌కు వచ్చేసరికి అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జొన్నడకు చెందిన గురునాథ రెడ్డి అనంతగిరి వెళ్తున్నాడు. తామరపల్లి జంక్షన్ వద్ద ఎదురెదురుగా వారిద్దరి వాహనాలు ఢీకొట్టడంతో స్కూటీపై వస్తున్న హెచ్‌సీ రమణ అక్కడక్కడే మృతిచెందాడు. గురునాథ రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. కాళ్లుచేతులు విరిగిపోయాయి. దీంతో కానిస్టేబుల్ గురునాథ రెడ్డిని స్థానికులు 108 అంబులెన్సులో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో గొర్లె పవన్‌కుమార్‌ను (21) హత్య చేసిన నిందితుడైన స్నేహితుడు బొంతు అప్పలనాయుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ తెలిపారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మృతుడు పవన్‌కుమార్ పూసపాటిరేగ మండలంలో ఇళ్లకు స్నేహితులతో కలిసి పెయింటింగ్ వేసేవాడు. స్నేహితుల్లో ఒకరైన బొంతు అప్పలనాయుడు పెయింటింగ్ వేయడం ద్వారా వచ్చిన డబ్బులను పెయింటింగ్ పనులు చేసే వారందరికీ పంచేవాడు. పెయింటింగ్ వేసిన వారిలో ఒకరైన గొర్లె పవన్‌కుమార్‌కు సంబంధించిన వెయ్యి రూపాయలు బొంతు అప్పలనాయుడు ఇవ్వాల్సి ఉండడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. స్నేహితుల వద్ద తనను పవన్‌కుమార్ అవమానపరుస్తున్నాడని అప్పలనాయుడు కక్షపెంచుకున్నారు. పవన్‌కుమార్‌ను ఎలాగైనా హత్య చేయాలని పన్నాగం పన్నాడు. గోడలకు సున్నాలు వేసిన బ్లేడును జేబులో ఉంచుకుని ఈ నెల 5వ తేదీ రాత్రి మద్యం తాగి పవన్‌కుమార్ వద్దకు అప్పలనాయుడు వచ్చాడు. ఎరుకొండ గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద రాత్రి 10 గంటల సమయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. కొంతసేపటి తరువాత పవన్‌కుమార్‌ను అప్పలనాయుడు బైక్‌పై ఎక్కించుకుని గ్రామం శివారుకు తీసుకువెళ్తుండగా పవన్‌కుమార్ ఇంటివద్దకు వచ్చేసరికి బైక్‌పైనుంచి దూకేశాడు. అక్కడ ఇద్దరి మధ్య మళ్లీ ఘర్షణ జరగడంతో పథకం ప్రకారం వెంటతెచ్చుకున్న కత్తితో పవన్‌కుమార్ కడుపులో అప్పలనాయుడు నాలుగు పోట్లు పొడిచేశాడు. పవన్ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న పవన్ తల్లి బంగారమ్మ వచ్చేలోపు అప్పలనాయుడు పరారయ్యాడు. పవన్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న అప్పలనాయుడు విశాఖపట్నం వెళ్లి పోవాలని ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అప్పలనాయుడిని కోర్టుకు తరలించారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన తలవరం సైన్స్ ప్రాజెక్టు

- సదరన్ ఇండియాకు ఎంపికైన 'నాన్ మోటార్ వాటర్ పంప్' ప్రాజెక్టు
- అభినందనలు తెలిపిన జిల్లా విద్యాశాఖాధికారులు



విద్యార్థులకు అవార్డు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కృష్ణారెడ్డి



తలవరం విద్యార్థులు రూపొందించిన 'నాన్ మోటార్ వాటర్ పంప్' ప్రాజెక్టు

వీరఘట్టం: విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో వీరఘట్టం మండలం తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. గైడ్ టీచర్ గిరడ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు దుప్పాడ నితిన్‌కుమార్, పి.గోవింద్‌లు రూపొందించిన 'నాన్ మోటార్ వాటర్ పంప్' ప్రాజెక్టు రాష్ట్ర విద్యాశాఖ అధికారులను ఆకట్టుకుంది.దీన్ని ఏవిధంగా తయారు చేయవచ్చు? దీని ఉపయోగాలను విద్యార్థులు చక్కగా వివరిస్తూ వారు చేసిన ప్రెజెంటేషన్ అందరినీ మంత్రముగ్ధులను చేయడంతో ఈ ప్రాజెక్టును సదరన్ ఇండియాకు ఎంపిక చేశారు.

అభినందనల వెల్లువ..

మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడంతో వారికి సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు బి.శ్రీనివాసరావు,రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణారెడ్డిలు అభినందించి ప్రశంసా పత్రాన్ని, అవార్డును అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు, పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం జగన్, జిల్లా సైన్స్ టీచర్ జి.లక్ష్మణరావులు విద్యార్థులను అభినందించారు. గైడ్ టీచర్‌తో పాటు మిగిలిన సైన్స్ టీచర్లను కూడా వారంతా అభినందించారు.

హెచ్‌ఎంపీవీపై అలెర్ట్



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వార్డును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు, ఆర్‌ఎంఓ సంతోష్‌కుమార్

- సర్వజన ఆస్పత్రిలో 10 పడకల వార్డు ఏర్పాటు
- మందులు, ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసిన అధికారులు
- వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు



హై ఫ్లోన్యాసల్ కాన్యులా మిషన్‌లు

విజయనగరం ఫోర్ట్: హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు దేశంలో నమోదుకావడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. వ్యాధి గ్రస్తులకు చికిత్స అందించడం కోసం ముందస్తు చర్యగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 10 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసింది. ఆస్పత్రిలో కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన హై ఫ్లోన్యాసల్ కాన్యులా (నిమషంలో 60 లీటర్ల ఆక్సిజన్ అందించే) వాటిని సిద్ధం చేసింది. అవసరమైన మందులను అందుబాటులో ఉంచింది. వదంతులు నమ్మవద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయని తెలియజేసింది.

కామన్ కోల్డ్ లాంటిది



హెచ్‌ఎంపీవీ కామన్ కోల్డ్ లాంటిది. భయపడాల్సిన అవసరం లేదు. ముందుస్తు చర్యల్లో భాగంగా సర్వజన ఆస్పత్రిలో 10 పడకల వార్డును, మందులను సిద్ధం చేశాం. కోవిడ్‌కు తీసుకున్నట్టు గానే ఈవైరస్ నివారణకు కూడా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. పిల్లలు, వృద్ధులు, హైరిస్క్ గ్రూపు వారు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, పలమనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

వైరస్ లక్షణాలు

జ్వరం, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి రిబావ్రిన్, అజిత్రో మైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హైరిస్క్ గ్రూపులకు చెందిన హెచ్‌ఐవీ, క్షయ, డయాలసిస్ రోగులు, సీఓపీడీ, ఆస్తమా రోగులు హెచ్‌ఎంపీవీ వైరస్ బారిన పడే అవకాశం ఉంది.


తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చేతులు పరిశుభ్రత పాటించాలి.
- మాస్కులు ధరించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయకూడదు.
- వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

పోక్సో కేసులో ముద్దాయిలకు మూడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయిలు పట్టణానికి చెందిన కోడూరు విజయకుమార్, కోడూరు శైలజలకు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మూడేళ్ల జైలు, రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసు వివరాలను ఎస్పీ వకుల్ జిందల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు గొడవపడి విడిపోగా తర్వాత తల్లి పట్టణానికి చెందిన గాడీఖానా రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కోడూరు విజయకుమార్ అనే వ్యక్తితో ఉంటోంది. బాలిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఉంటున్న అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటోంది. అమ్మ ఒడి డబ్బుల విషయమై రైల్వేక్వార్టర్స్‌లో ఉంటున్న తల్లి కోడూరు శైలజ ఇంటి దగ్గరకు బాలిక వెళ్లగా ఆ సమయంలో అక్కడ ఉన్న మారటి తండ్రి కోడూరు విజయకుమార్ బాలికను లైంగికంగా వేధించగా దానికి తన తల్లి కోడూరు శైలజ ప్రోత్సహించింది. ఈ మేరకు బాలిక విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై పి.శ్యామలాదేవి పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసి, అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ ఈ.నరసింహామూర్తి చర్యలు చేపట్టగా, కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో త్వరితగతిన ముద్దాయిలకు శిక్షపడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

80 శాతం ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

తెర్లాం: జిల్లాలో 80 శాతం మేర ధాన్యం సేకరణ పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు తెలిపారు. తెర్లాంలో స్థానిక విలేకరుతో ఆయన బుధవారం మాట్లాడారు. జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 2.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. జిల్లాలో ఎస్.కోట, విజయనగరం మండలాల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో 56 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇంత వరకు 28,548 హెక్టార్లలో పంటలు సాగు చేయడం పూర్తయిందన్నారు. వీటిలో 9,599 హెక్టార్లలో మొక్కజొన్న, 5 వేల హెక్టార్లలో పెసలు, 11,598 హెక్టార్లలో మినుము, 144 హెక్టార్లలో వేరుశనగ, 460 హెక్టార్లలో రాగులు, 80 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగుచేశారని తెలిపారు. జిల్లాలోని కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరుకు ఈ నెల 7 నుంచి 9 వరకు బ్యాంకు బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 18వేల మంది కౌలు రైతులు ఉండగా, 12,800 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఉన్నాయన్నారు.